క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చెన్నారావుపేట: మండలంలోని చెన్నారావుపేట, ఉప్పరపల్లి, లింగగిరి, పాపయ్యపేట, అమీనాబాద్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల పనులు జరుగుతున్నందున నేడు (శనివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ జోగానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నల్లబెల్లి: మండలంలోని మేడపల్లి, మూడుచెక్కలపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు పనులకు సహకరించాలి

ఖానాపురం : రోడ్డు నిర్మాణ పనులకు రైతులు సహకరించాలని ఎన్‌హెచ్ ఈఈ మనోహర్ అన్నారు. మండలంలోని మంగళవారిపేట శివారులో రోడ్డు నిర్మాణ పనులను కొద్ది రోజులుగా ప్రజలు అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం అధికారులు ప్రజలతో మాట్లాడారు. రోడ్డు కింద భూములు కోల్పోతున్నవారికి మరో చోట భూములు అప్పగిస్తామని తెలిపారు. రోడ్డు మధ్యలో ఉన్న హనుమాన్ దేవాలయాన్ని మరో చోట నిర్మించడానికి నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 15 రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు. అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు



చెన్నారావుపేట : ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి కింద పడడంతో గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని సూరుపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన పూజారి కట్టయ్య వృత్తిరీత్యా రోజువారీగా తాటి చెట్టు ఎక్కడానికి తాటి వనంలోకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడ్డాడు. దీంతో అతనికి తీవ్రగాయాలయ్యాయని తెలిపారు. వెంటనే చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

బీమా నగదు అందజేత



సంగెం: మండలంలోని మొండ్రాయి గ్రామంలో భారతీయ పురుషుల పొదుపు సంఘంలోని ఇద్దరు సభ్యులు గూడ రమణ, పెండ్లి సంపత్‌లు ఇటీవల మృతి చెందారు. రమణ నామిని అయిన భార్య స్రవంతికి అభయనిధి, ఇన్సూరెన్స్ మొత్తం కలిపి రూ 79,401లు, సంపత్ భార్య పద్మకు రూ1,03,324లు శుక్రవారం సంఘ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దేవులపల్లి రాజు, ఉపాధ్యక్షుడు యాకయ్య, పాలకవర్గం సభ్యులు, గణకుడు పురుషోత్తం పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీల నియామకం



కొమ్మాలు,అధ్యక్షుడు



యాకయ్య, అధ్యక్షుడు

నెక్కొండ : ఎమ్మార్పీఎస్ బలోపేతానికి గ్రామ కమిటీలు దోహదపడుతాయని ఆ సంఘం మండల కన్వీనర్ జంజాల యాకుబ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సంఘం సమావేశంలో వివిధ గ్రామాల కమిటీలను వెల్లడించారు. దీక్షకుంట అధ్యక్షుడిగా కంజర్ల కొమ్మాలు, గుండ్రపల్లి అధ్యక్షుడిగా బిర్రు యాకయ్య, పనికర అధ్యక్షుడిగా చెరుకు వెంకటాద్రి, అమీన్‌పేట గ్రామ అధ్యక్షుడిగా జానకీరాంలతో పాటు ఆయా గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కో–కన్వీనర్ ఈదునూరి వెంకన్న, గౌరవ అధ్యక్షులు ఈదునూరి ప్రభాకర్, గద్దం రమేశ్, కొమ్ము కార్తీక్, పట్టణ అధ్యక్షుడు కొలకనూరి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మంజూరు ఒకచోట.. బోధన మరోచోట

- మండలంలో సొంతభవనం లేని బీసీ హాస్టల్
- స్థలం కేటాయించని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు



ఖానాపురం మండలం ఐనపల్లిలో కొనసాగుతున్న బీసీ గురుకుల పాఠశాల

నెక్కొండ : బడిమధ్యలో మానేయకుండా.. వసతితో కూడిన బోధన అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలను ప్రారంభించింది. గురుకులాలు అందుబాటులోకి వచ్చి ఏళ్లు గడిచినా సొంత భవనాలు నిర్మించలేదు. దీంతో అసౌకర్యాలతో కూడిన అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. దీని కారణంగా విద్యార్థులకు ప్రతిరోజు ఇబ్బందులు తప్పడ లేదు.

ఏడేళ్ల క్రితం మంజూరైన పాఠశాల

బీసీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (ఎంజేపీటీబీసీ డబ్ల్యూఆర్ఈఐఎస్) దృష్టి సారించాల్సి ఉంది. ఏడేళ్ల క్రితం మండలానికి మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల మంజూరైంది. ఒక ఏడాది అరకొర వసతుల మధ్య అద్దె భవనంలో కొనసాగింది. విద్యార్థులకు వసతితోపాటు సరైన తరగతి గదులు లేక పోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. మండల కేంద్రంలో పక్కా భవనం నిర్మించి అన్ని వసతులు కల్పించాలని అప్పటి విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగారు. స్థానిక అధికారులు నిర్లక్ష్యం చేయడంతో పాటు వసతి సౌకర్యం లేదన్న కారణం చూపి, దాన్ని ఖానాపురం మండలం ఐనపల్లిలో ఏర్పాటు చేశారు.

ప్రైవేట్ ఐటీఐ కళాశాల భవనంలో...

ఖానాపురం మండలంలోని బుధరావుపేట (ఐనపల్లి)లోని విజేత ఐటీఐ భవనంలో అద్దె ప్రాతిపదికన బీసీ (బాలికల) గురుకులాన్ని అసౌకర్యాల మధ్య నిర్వహిస్తున్నారు. 5 నుంచి 10 వరకు 560 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడి ఇంటర్మీడియట్ తరగతులు వరంగల్ ఉర్సులో కొనసాగుతున్నాయి. ఇక్కడే ఓ వైపు ఐటీఐ కొనసాగుతుండగా.. మరో వైపు గురుకులం కొనసాగుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి వెంటనే సమస్య పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకవెళ్తా...



మంజూరు సమయంలో నిర్ణయించిన లోకేషన్‌లోనే పాఠశాలను కొనసాగించేందుకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి తీసుకువెళ్తా.. నెక్కొండకు మంజూరైన పాఠశాల వసతుల లేమి కారణంగానే మరో చోటకు తరలివెళ్లింది. ఎమ్మెల్యే చొరవతో గురుకులాన్ని తీసుకొస్తాం.

– సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



అయ్యప్పస్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అన్నదాతలు

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్త అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలడుగుల పూర్ణచందర్–శ్రీలత, వేములపల్లి మాధవి–సంతోష్‌కుమార్, శ్రీహిత, నర్సంపేట లారీ ఓనర్స్ అసోసియేషన్, కాకతీయ గురుకులం రుద్రగూడెం కమలాకర్‌రావు, మల్లంపాటి సుప్రియ–వంశీకృష్ణ, దాత్రిక్, కేతిడి భార్గవి, అశోక్‌రెడ్డి, జాటోత్ మీనాక్షి, మంజులాల్, సమ్మెట నిహారిక–ప్రశాంత్, మోతి నర్మదా–సత్యనారాయణరెడ్డి, బెంద్రం విజయ–హరీష్‌రెడ్డి, చాపల శ్రీనివాస్‌రెడ్డి–సుమలత, పరిష హిమగిరి, కంచు రవి, మంజుల, శశిప్రీతంలు అయ్యప్పస్వామికి అభిషేక పూజలు నిర్వహించారు. మాలధారులకు, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సైఫ సురేష్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి రవీందర్, చంద్రశేఖరం, శ్రీరాంఈశ్వరయ్య, చెంచారావు, శ్రీనివాస్, వేణుగోపాల్, రామనాథం, వేణు, రాజు, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయ పనులు ప్రారంభం



రాయపర్తి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వెనకభాగంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ పనులను ప్రారంభించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు పనులను ప్రారంభించినట్లు పార్టీ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ రైతు బంధు అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఎండీ నయీం, గ్రామశాఖ అధ్యక్షుడు ముద్రబోయిన సుధాకర్, గారె నర్సయ్య, పోగులకొండ వేణు తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలి

- అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

నర్సంపేట : దేశంలో రైతాంగంపై, వ్యవసాయ రంగ అభివృద్ధి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వ్యవసాయ రంగంలో స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి చంద్రన్నలు డిమాండ్ చేశారు. పట్టణంలో ఏఐపీకేఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం మైదం పాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఒక క్వింటా ధాన్యానికి తరుగు పేరిట 5 నుండి 7 కిలోల వరకు తీస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నా అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పోడు భూమి పట్టాలు లేని రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా అనేక ఆంక్షలు విధిస్తూ పోడు రైతులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.15వేలు ఇస్తామని చెప్పిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐపీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి, జిల్లా నాయకులు లింగన్న, కొమురయ్య, రవి, కుమార్, యాకన్న, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ



రాయపర్తి: మండలంలోని జయరాంతండా(కె) బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు లావుడ్య వాసునాయక్ తండ్రి రెడ్యానాయక్ శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రెడ్యానాయక్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వాసునాయక్‌ను పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి పూస మధు, చిట్యాల వెంకన్న, స్థానిక నాయకులు ఉన్నారు.

బాలల అక్రమ రవాణాను అరికట్టాలి



మాట్లాడుతున్న చైల్డ్‌లైన్ కేస్ వర్కర్ మౌనిక

నర్సంపేట : బాల్య వివాహాలు, బాలకార్మికులు, బాలికలపై లైంగిక వేధింపులు, బాలల అక్రమ రవాణాను అరికట్టాలని చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్ జక్కోజు కృష్ణ, చైల్డ్‌లైన్ కేస్ వర్కర్ దారావత్ మౌనిక అన్నారు. పట్టణంలోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం చైల్డ్ హెల్ప్‌లైన్–1098 వరంగల్ ఆధ్వర్యంలో బాలికలకు చైల్డ్ హెల్ప్‌లైన్–1098 అందించే సేవలు, బాలల సమస్యల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపద సమయంలో 18 ఏళ్ల లోపు బాలబాలికలు ఎవరైనా 1098కు ఉచిత కాల్ ద్వారా సమాచారం అందించి రక్షణ పొందవచ్చని తెలిపారు. స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ బాలికలు ధైర్యంగా సమస్యలను ఎదురించే స్థాయికి ఎదగాలని అన్నారు. అపరిచిత వ్యక్తుల ప్రవర్తన పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీపాల, స్కూల్, కాలేజీ కో–ఆర్డినేటర్లు శైలజ, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

అంబర్, గుట్కా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

పరకాల : పట్టణంలో విచ్చలవిడిగా అంబర్, గుట్కా విక్రయిస్తున్న కిరాణషాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకృష్ణ శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. బొడ్రాయి వద్ద కిరాణం షాపు నడుపుతున్న పుల్లెల సత్యనారాయణ అంబర్, గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నారనే పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్, పోలీసులు సంయుక్తంగా దాడులు చేసినట్లు తెలిపారు. అయితే దుకాణానికి తాళం వేసి పారిపోతున్న సత్యనారాయణను అదుపులోకి తీసుకొని దుకాణంలో తనిఖీ చేయగా రూ.80వేల 160 విలువచేసే అంబర్, గుట్కా ప్యాకెట్లు లభ్యమైనట్లు తెలిపారు.సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే



ఇంటింటి సర్వే చేస్తున్న అధికారులు

దుగ్గొండి: మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే రెండు రోజులుగా కొనసాగుతోంది. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని 34 గ్రామ పంచాయతీల పరిధిలో 13028 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు గాను ప్రతి 400 మందికి ఒక సర్వేయర్‌ను నియమించారు. సర్వేయర్లు ప్రతిరోజు 25 ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించి లొకేషన్ ఫొటో తీసుకోవాల్సి ఉంది. అయితే వివరాల సేకరణ ఆన్‌లైన్ చేయాల్సి ఉండటంతో రోజుకు 10 ఇళ్లకు మించడం లేదు. ఇప్పటికీ 268 ఇళ్లలో సర్వే చేయగా 123 మంది వివరాలు ఆన్‌లైన్ పూర్తి చేశారు.

బెల్ట్‌షాపులను మూసివేయాలి

శాయంపేట : గ్రామాల్లో విచ్చలవిడిగా వెలసిన బెల్ట్‌షాపులను మూసివేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించని వైన్‌షాపులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైన్ షాపు నిర్వాహకులు సిండికేట్‌గా ఏర్పాడి అక్రమ దందాకు తెరలేపారని ఆరోపించారు. అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, సంబంధిత శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. నాయకులు అభివర్ధన్, ఖలీల్, పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల్లో సత్తా చాటిన 'విద్యోదయ'



విద్యార్థులను అభినందిస్తున్న నాగార్జున్‌రెడ్డి

నెక్కొండ : మండల కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని విద్యోదయ గురుకుల పాఠశాల కరస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి తెలిపారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల నుంచి ప్రపంచస్థాయి విజేతల కోసం సీఎం కప్ క్రీడా పోటీలు దోహదపడుతాయన్నారు. మండల స్థాయి కబడ్డీలో జూనియర్ విభాగంలో బి.యమున, బి.దివ్య (ప్రథమ), ఎం. రేవంత్, బి.గణేశ్, బి. సిద్ధార్థ (ద్వితీయ), వాలీబాల్‌లో ఎస్.అరుణ్ (ప్రథమ), ఖోఖోలో బి.యమున, బి. కావ్య, బి.దివ్య, బి.సరస్వతి, డి. హిమబిందు (ద్వితీయ) స్థానాల్లో నిలిచారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చల్లా పారిజాతం, ప్రిన్సిపాల్ మహ్మద్ షరీఫ్, పీఈటీ వెంకట్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

పర్వతగిరి : గ్రామ పంచాయతీ కార్యదర్శులు పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని మూడెత్తులతండా, మాల్యతండా, ఏనుగల్, గుగులోతు తండా, తూర్పు తండా, భట్టుతండా, చింతనెక్కొండ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ జరిగేలా చూడాలని కార్యదర్శులను ఆదేశించారు. ఆయన వెంట ఏపీఓ సుశీల్‌కుమార్, కార్యదర్శులు రాజు, యాకుబ్‌నాయక్, అరుణ్, యాకయ్య, చైతన్య, సరిత పాల్గొన్నారు.

గౌడ కులస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి

- గౌడ జనహక్కుల పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్ గౌడ్



రాజుగౌడ్‌ను శాలువాతో సన్మానిస్తున్న రమేశ్‌గౌడ్

నల్లబెల్లి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలు గౌడ కులస్తులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని గౌడ జనహక్కుల పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ గౌడ్ కోరారు. స్థానిక కంఠ మహేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎన్నిక ఏదైనా రాజకీయాలకతీతంగా కుల సంఘం నిర్ణయానికి కట్టుబడి గౌడ సామాజికవర్గం అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పౌరుషాన్ని చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం మోకుదెబ్బ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అధ్యక్షుడిగా మేడిపల్లి రాజు, గౌరవ అధ్యక్షుడిగా కోటగిరి నారాయణ, ఉపాధ్యక్షుడిగా పెరుమాండ్ల శ్రీనివాస్, కోశాధికారిగా ముత్యాల కుమార్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మచ్చిక రవి, కార్యవర్గ సభ్యులుగా నాగపురి సాగర్ ఎన్నికైనట్లు పేర్కొన్నారు. ఎన్నికైన వారిని శాలువాతో సన్మానించారు. సమావేశంలో మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి మదెద్ద సాంబయ్య, జిల్లా కార్యదర్శి కొండి రాము, నాయకులు రాజేందర్, రమేశ్, ఐలయ్య, సాంబయ్య, బీం పాల్గొన్నారు.

హమాలీ కూలి రేట్లు పెంచాలి



ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న మిల్లు అండ్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు

- ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశం

నర్సంపేట: పెరిగిన ధరలకు అనుగుణంగా హమాలీ కూలి రేట్లు పెంచి రైస్ మిల్లుల్లో ధాన్యం దిగుమతులకు ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ సంచులను నిషేధించాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం డిమాండ్ చేశారు. మిల్ అండ్ హమిలీ వర్కర్స్ యూనియన్ ఏఐఎఫ్‌టీయూ (న్యూ) అనుబంధం వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ రెండో దఫా అధికారంలోకి వచ్చిన తర్వాత సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలతో కుమ్మక్కై దేశంలో అనేక ఏళ్లుగా పోరాడి సాధించుకున్న 44 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తీసుకుకొచ్చిందన్నారు. గతంలో యాజమాన్యాలతో హమాలీ కార్మికులు చేసుకున్న రేట్ల ఒప్పందం డిసెంబర్ 21తో ముగుస్తున్నందున మళ్లీ నూతన రేట్ల ఒప్పందం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటి ఉన్నాయని, మరో వైపు ప్రభుత్వ విద్య, వైద్యం, కనీస సౌకర్యాలు లేక పేదలకు అందని ద్రాక్షలా మారిందన్నారు. అసంఘటిత కార్మికులకు సమగ్రమైన చట్టం తీసుకువచ్చి కనీస వేతనాలు, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి, అధ్యక్షుడు బొర్ర ఆనంద్, జిల్లా నాయకులు రాంచందర్, అశోక్, వీరన్న, అనిల్, మిల్ అండ్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు రొట్టె శ్రీనివాస్,యాకన్న, మల్లన్న, శ్రీనివాస్, పోశాలు, రవి, రాజు, ఐలయ్య, ఏకాంబరం, రమేశ్, రాజేందర్, మొగిలి, రమేశ్, ప్రశాంత్, ఐలయ్య, వనయ్య, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



రైస్‌మిల్లుల యాజమాన్య యూనియన్ అధ్యక్షుడికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రెండేళ్లకోసారి రేట్లు పెరగాలి

రైస్ మిల్లులో పని చేసే హమాలీ కార్మికుల రేట్లు పెంచాలని బీఆర్‌టీయూ హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు గుంపెల్లి మునీశ్వర్ డిమాండ్ చేశారు. బీఆర్‌టీయూ, ఏఐటీయూసీ కార్మిక సంఘాల హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం రైస్‌మిల్లు యాజమాన్య యూనియన్ అధ్యక్షుడు గంధం నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రెండేళ్లకోసారి రేట్లు పెరగాలని ఈ ఒప్పందంలో భాగంగా ఈనెల 21తో ముగుస్తుందని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచే విధంగా లేబర్ అధికారులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుండెబోయిన కొమురయ్య, గాండ్ల రాములు, బొల్లం ప్రసాద్, ఎడ్ల నాగులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు

పర్వతగిరి: గత దశాబ్ద కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఆదర్శ పాఠశాలలో శుక్రవారం భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ 010 పద్దు ద్వారా జీతాలు, నోషనల్ సర్వీస్ సాధన, పీజీటీలకు జేఎల్ అప్‌గ్రేడేషన్, కారుణ్య నియామకాలు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్ పి.శ్రీదేవి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వైద్యపరీక్షలు చేయించాలి



పశువ్యాధులపై అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి శ్రీలక్ష్మి

ఖానాపురం: రైతులు పశువులకు వైద్యపరీక్షలు చేయించాలని పశువైద్యాధికారి శ్రీలక్ష్మి అన్నారు. మండలంలోని ధర్మారావుపేటలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆడదూడలు పుట్టేందుకు లింగనిర్ధారణ సార్టెడ్ సెమెన్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. 86 పశువులకు వైద్యపరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. గోపాలమిత్ర సూపర్‌వైజర్ జహంగీర్, యాకుబ్‌పాషా, అనిల్ పాల్గొన్నారు.